సాక్షి
తూర్పుగోదావరి

సోమవారం । 27 । మార్చి । 2023



నిత్యాన్నదానానికి విరాళం


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి సత్తి భాస్కరరెడ్డి, పద్మావతి దంపతులు (అనపర్తి మండలం పొలమూరు) ఆదివారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.




వెండి వస్తువుల సమర్పణ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): గాంధీనగర్ వేంకటేశ్వరస్వామి వారికి ఆకెళ్ల వీరభద్రకుమార్ దంపతులు ఆదివారం 3.50 కేజీల వెండితో తయారు చేసిన ఆభరణాలు సమర్పించారు.

డెల్టాలకు 6,635 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 6,635 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,960, మధ్య డెల్టాకు 1,275, పశ్చిమ డెల్టాకు 3,400 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 7.30 అడుగులకు చేరింది.



రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

కోట సత్తెమ్మ తల్లికి రూ.1.71 లక్షల ఆదాయం

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న కోట సత్తెమ్మ అమ్మవారికి దర్శనాలు, వివిధ రూపాల్లో ఆదివారం రూ.1,70,900 ఆదాయం సమకూరింది. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యాన కోటసత్తెమ తల్లికి ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. ఈ నెల 27న అమ్మవారి ఆలయ హుండీలు తెరచి ఆదాయం లెక్కించనున్నామని ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) తెలిపారు.

జాబ్‌మేళా రద్దు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యాన స్థానిక ఆర్ట్స్ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్‌లో ఈ నెల 28న నిర్వహించ తలపెట్టిన జాబ్‌మేళా రద్దయింది. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేదీ ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

మెజీషియన్‌కు సతీష్‌కు ఉగాది పురస్కారం



ఉగాది పురస్కారం అందుకుంటున్న సతీష్

బిక్కవోలు: కొంకుదురు గ్రామానికి చెందిన అంతర్జాతీయ మెజీషియన్ సతీష్‌కు జాతీయ ఉగాది పురస్కారం లభించింది. అంతర్జాతీయ గుర్తింపు పొందిన వే ఫౌండేషన్ తిరుపతిలో ఆదివారం నిర్వహించిన సభలో ఆయన ఈ పురస్కారం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ రీజినల్ డైరెక్టర్, తిరుపతి హబ్ ఏపీటీడీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రావూరి రమణ ప్రసాద్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

నూకాంబిక తీర్థానికి భక్తుల తాకిడి



చింతలూరు నూకాంబికా ఆలయ ముఖద్వారం వద్ద భక్తుల తాకిడి

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసియున్న శ్రీ నూకాంబికా అమ్మవారి తీర్థోత్సవాల్లో భక్తుల తాకిడి ఆదివారం విపరీతంగా ఉంది. ఉత్సవాలు ప్రారంభమై వారం రోజులు కావస్తున్నా భక్తుల సంఖ్య మాత్రం తగ్గడం లేదు. ఆదివారం సెలవు దినం కావడంతో సుదూర, పరిసర ప్రాంతాల నుంచి విచ్చేసిన వేలాది మంది భక్తులతో క్యూలు కిక్కిరిసి పోయాయి. అధికసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి మొక్కుబడులను తీర్చుకున్నారు. మహిళలు పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను అందజేశారు. చిన్నారులు కాగడాలు వెలిగించారు. బాల బాలికలు జెయింట్‌వీల్, రంగులరాట్నం ఎక్కేందుకు ఎగబడ్డారు. భక్తుల తాకిడి, వాహనాల రద్దీతో కొత్తూరు సెంటర్ నుంచి చింతలూరు వరకూ ట్రాఫిక్ నిలిచిపోయింది.

కిక్కిరిసిన అయినవిల్లి

అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ప్రధానార్చకుడు వినాయకరావు ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు చేశారు. స్వామివారి లఘున్యాస అభిషేకాల్లోను, లక్ష్మీగణపతి హోమంలోను భక్త దంపతులు పాల్గొన్నారు. స్వామివారికి గరిక పూజ జరిపారు. నూతన వాహనాలకు పూజలు చేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనం ద్వారా రూ.18,000, అన్నప్రసాదాలకు వచ్చిన విరాళాలు రూ.82,000, వివిధ సేవలకు రూ.10,000 ప్రసాదాల విక్రయం ద్వారా రూ.26,000, వివిధ విరాళాల ద్వారా రూ.24,000 మొత్తం రూ.1,60,000 ఆదాయం లభించిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

నకిలీకి చెక్

- జిల్లాలో ఐదుచోట్ల వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ల ఏర్పాటు
- అనపర్తి, కోరుకొండల్లో ఇప్పటికే సేవలు
- మిగిలినచోట్లా త్వరలో అందుబాటులోకి..
- విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల్లో కల్తీ అరికట్టడమే లక్ష్యం

సాక్షి, రాజమహేంద్రవరం: నాణ్యమైన విత్తనం, ఎరువులు, పురుగు మందులు రైతుకు అందిస్తేనే వ్యవసాయ రంగంలో ఆశించిన మేర దిగుబడి, ఆదాయం సమకూరుతాయి. కొన్నేళ్లుగా అన్నదాతలను నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల సమస్య పట్టి పీడిస్తోంది. అధిక దిగుబడులు సాధించేందుకు పలువురు రైతులు అప్పులు చేసి మరీ ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. వాటిని పంటకు అవసరమైన సమయంలో వేస్తున్నారు. వాటిల్లో నకిలీవి ఉంటే దిగుబడి వచ్చే సమయంలో వారికి చేదు అనుభవం తప్పడం లేదు. ఈ సమస్యకు చెక్ చెప్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్'లు ఏర్పాటు చేసి, భరోసా కల్పిస్తోంది. తద్వారా ఎరువులు, పురుగు మందులు, విత్తనాల నాణ్యతను ఉచితంగా పరీక్షించుకునే వెసులుబాటును రైతులకు కల్పించింది.

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ల్యాబ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 5 ల్యాబ్‌లు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇప్పటికే అనపర్తి, కోరుకొండ (రాజానగరం నియోజకవర్గం) గ్రామాల్లో వీటి నిర్మాణాలు పూర్తయి, రైతులకు సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ ల్యాబ్‌లలో నాణ్యత నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. నిడదవోలు, కుమారదేవం (కొవ్వూరు), గోపాలపురం గ్రామాల్లో చిన్నచిన్న పనులు మినహా నిర్మాణాలు పూర్తయ్యాయి. మరికొద్ది రోజుల్లోనే ఇవి కూడా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్నాయి.

టెస్టింగ్ ప్రక్రియ ఇలా..

ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల నాణ్యత పరీక్షలను పారదర్శకంగా చేపట్టేందుకు తిరుపతి, అమరావతి, తాడేపల్లిగూడెం, విశాఖపట్నాల్లో ప్రభుత్వం నాలుగు రీజినల్ కోడింగ్ సెంటర్లు ఏర్పాటు చేసింది. ప్రభుత్వ లక్ష్యాల మేరకు వ్యవసాయాధికారులు (ఏఓ) ఎరువుల దుకాణాల్లో విత్తనాలు, ఎరువుల శాంపిళ్లు సేకరించి యాప్ ద్వారా బ్యాచ్ నంబరు కోడింగ్ చేసి రీజినల్ సెంటర్లకు పంపిస్తారు. ఆ శాంపిళ్లను రీజినల్ సెంటర్ బాధ్యులు ఆయా నియోజకవర్గాల్లోని అగ్రి ల్యాబ్‌లకు పంపి పరీక్షలు చేయిస్తారు. విత్తనాలైతే మొలక శాతం, తేమ శాతం, విత్తన నాణ్యత ప్రమాణాలు, పరిణామాలపై పరీక్షలు నిర్వహించి నివేదిక ఇస్తారు. నకిలీవని తేలితే సంబంధిత షాపులపై చర్యలకు సిఫారసు చేస్తారు. కేసు పెట్టి కోర్టు ముందు నిలబెడతారు. సంబంధిత కంపెనీపై ఏ చర్యలు తీసుకోవాలో న్యాయస్థానం నిర్ణయిస్తుంది. ఎరువులు నకిలీవిగా తేలితే వాటిని రీ–అనాలసిస్ (తిరిగి పరిశీలన) చేసేందుకు షాపులో ఉన్న సరకు సీజ్ చేస్తారు. కేసు బకాయించి జాయింట్ కలెక్టర్ కోర్టులో హాజరు పరుస్తారు. చర్యలపై అక్కడ నిర్ణయం తీసుకుంటారు.

రైతుకు పరీక్షలు ఉచితం

కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులపై అనుమానం ఉన్న రైతులు దగ్గరలోని ల్యాబ్‌కు వెళ్లి పూర్తి ఉచితంగా పరీక్ష చేయించుకునే వెసులుబాటు కల్పించారు. ఇందుకు ఏఓలు సహకరించాలి. ట్రేడర్లు, విత్తన, ఎరువులు, పురుగు మందుల కంపెనీల నిర్వాహకులు పరీక్షలు చేయించుకోవాలంటే మాత్రం ప్రభుత్వం నిర్ణయించిన మేరకు రుసుం చెల్లించాల్సి ఉంటుంది.



శాంపిళ్ల పరీక్ష, నిర్ధారణ ఇలా..

శాంపిళ్లను ఏసీటీ (వ్యవసాయాధికారులు), ఆర్‌బీకే, రైతులు, ట్రేడర్లు అనే నాలుగు రకాలుగా విభజించి పరీక్షిస్తారు. జిల్లాలో ఇప్పటి వరకూ వివిధ రకాల 372 శాంపిళ్లు పరీక్షించగా.. 9 మాత్రమే నాసిరకంగా తేలాయి. ఆ వివరాలు..

శాంపిళ్లు	పరీక్షించినవి	నాణ్యత లేనివి
విత్తనాలు (రీజినల్ సెంటర్)	171	3
ఎరువులు	135	3
ఎరువులు (ఆర్‌బీకే పరిధి)	4	0
విత్తనాలు (ట్రేడర్స్)	23	0
ఎరువులు (ట్రేడర్స్)	22	3
ఎరువులు (రైతులు)	17	0

ట్రేడర్స్ నుంచి వసూలు చేసిన మొత్తం : రూ.17,300



కోరుకొండ ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న టెక్నీషియన్లు

వ్యయప్రయాసలకు చెల్లు

ఎరువులు, పురుగు మందులు, విత్తనాల నాణ్యత పరీక్ష చేయించుకోవాలనుకుంటే గతంలో గుంటూరు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఈ క్రమంలో వ్యయ ప్రయాసలు అధికమయ్యేవి. ప్రస్తుతం సమీపంలోనే ఈ ల్యాబ్‌లు అందుబాటులోకి రావడం.. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పరీక్షలు నిర్వహిస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అగ్రి ల్యాబ్‌లకు ఇన్‌చార్జిలుగా వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ సంచాలకుడు (ఏడీఏ) వ్యవహరిస్తారు. ఒక ఏఓ డెప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. ఒక టెక్నీషియన్ ల్యాబ్ పరీక్షలు నిర్వహిస్తుండగా వీరికి సహాయకుడిగా ఏఓ వ్యవహరిస్తారు.



గోపాలపురంలో సేవలకు సిద్ధంగా ఉన్న అగ్రి ల్యాబ్

రైతులు వినియోగించుకోవాలి



అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. నకిలీల నుంచి పంటను కాపాడుకునే అవకాశం లభిస్తుంది. రైతులు శాంపిళ్లు తీసుకువచ్చి ల్యాబ్‌లో పరీక్ష చేయించుకోవాలి. జిల్లాలో ఇప్పటికే రెండు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాగా, మిగిలినవి త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ అధికారి

ఉత్సవమూర్తులకు వెండి కిరీటాల సమర్పణ



వెండి కిరీటాలు సమర్పిస్తున్న గుప్తా దంపతులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి సన్నిధిలో కొలువుదీరిన ఉత్సవమూర్తులకు 238 గ్రాముల వెండితో తయారు చేయించిన రూ.22 వేల విలువైన కిరీటాలను అదే గ్రామానికి చెందిన గుడిమెట్ల నాగ వెంకట సత్య సూర్య మణికంఠ లోకేష్‌గుప్తా, దివ్య దంపతులు, వారి కుటుంబ సభ్యులు సమర్పించారు. వీటిని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టీ గూటం శ్రీనివాస్‌కు ఆదివారం అందజేశారు. సంప్రోక్షణ అనంతరం వెండి కిరీటాలను స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అలంకరించారు. కొత్తపేటకు చెందిన మల్లంపల్లి అయ్యప్పరాజు, బాలాత్రిపుర సుందరి దంపతుల స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు మల్లంపల్లి గోపాలకృష్ణ నిత్యాన్నదానం ట్రస్టుకు రూ.10 వేలు విరాళంగా ఇచ్చారు. ఆలయ ఈఓ ఎంకేటీ నాగవరప్రసాద్ దాతకు స్వామి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందించారు. కాగా స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.1.16 లక్షల ఆదాయం వచ్చింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.67,820 రాగా నిత్యాన్నదానం ట్రస్టుకు రూ.48,464 విరాళంగా ఇచ్చారు. 1,792 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. 1,163 మంది స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు.

వైభవంగా పందిరి రాట

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి శ్రీజగన్మోహినీ కేశవస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి పందిరి రాట కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు బోణం సాయిబాబు, ఆలయ ఈవో బి.కృష్ణచైతన్య ఆధ్వర్యంలో అర్చకులు పందిరి రాట వేశారు. అంతకుముందు స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ నెల 30 నుంచి వారం రోజులపాటు స్వామి వారి కల్యాణోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఈవో తెలిపారు.

వైఎస్సార్ సీపీని గెలిపించిన టీచర్లకు కృతజ్ఞతలు



సభలో ప్రసంగిస్తున్న మంత్రి వనిత. చిత్రంలో వాసిరెడ్డి పద్మ, ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులు

- హోం మంత్రి తానేటి వనిత
- అపుస్మా ఆధ్వర్యాన ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి సత్కారం

రాజమహేంద్రవరం రూరల్: టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఘన విజయం అందించిన ఉపాధ్యాయ వర్గానికి రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల టీచర్ ఎమ్మెల్సీలుగా ఎన్నికైన ఎంవీ రామచంద్రారెడ్డి (పశ్చిమ రాయలసీమ), పి.చంద్రశేఖరరెడ్డి(తూర్పు రాయలసీమ)లకు కాతేరు వెంకటాద్రి గార్డెన్స్‌లో ఆదివారం సత్కార సభ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యాన జరిగిన ఈ సభలో మంత్రి వనిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వినూత్న విధానాలతో విద్యా రంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు బురద జల్లుతున్న సమయంలో ఉపాధ్యాయులు తమకు ఘన విజయం అందించారని అన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి టీచర్ ఎమ్మెల్సీలు టి.కల్పలతారెడ్డి, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి కృషి చేస్తారని చెప్పారు. అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన రామచంద్రారెడ్డి ఎమ్మెల్సీగా ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరిస్తారని అన్నారు.

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ, ఉపాధ్యాయులందరి ఐక్యతతోనే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించామని చెప్పారు. టీచర్ ఎమ్మెల్సీలు ఉపాధ్యాయ సమస్యలతో పాటు, ప్రభుత్వానికి సంబంధించిన ప్రాధాన్య అంశాలపై కూడా గళం విప్పాలని సూచించారు. విద్యా రంగానికి ఎవరు ప్రాధాన్యం ఇస్తున్నారు, ఎవరు సమూల మార్పులు తీసుకువస్తున్నారో గ్రహించినందునే ఉపాధ్యాయులు వైఎస్సార్ సీపీకి ఘన విజయం అందించారని అన్నారు.

వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ, సమాజాభివృద్ధిలో కూడా ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కొత్తగా ఎన్నికైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీలకు విజ్ఞప్తి చేశారు. ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో వైఎస్సార్ సీపీని గెలిపించి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై సంపూర్ణ విశ్వాసం ప్రకటించారని, ఇదే విధంగా 2024 ఎన్నికల్లో కూడా జగన్‌కే పట్టం కట్టాలని కోరారు. గ్రాడ్యుయేట్లు జగనన్న సంక్షేమ పథకాలను పూర్తిగా అధ్యయనం చేస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ, దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన ప్రభుత్వ విద్యా వ్యవస్థను గాడిలో పెట్టి, పేదల పిల్లలకు ఉత్తమ విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం కృషి చేస్తున్నారని చెప్పారు. భావి భారత పౌరుల భవితను తీర్చిదిద్దడం ప్రభుత్వ పాఠశాలల బాధ్యత మాత్రమే కాదని, ప్రైవేటు విద్యా సంస్థలు కూడా తమ వంతు తోడ్పాటు అందించాలని అన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా..

పశ్చిమ రాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు మధ్య వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. శాసన మండలిలో ఉపాధ్యాయుల గళం వినిపిస్తానని అన్నారు. అపుస్మా గౌరవ సలహాదారు, తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి, అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు వి.జనార్దనరెడ్డి, స్టేట్ చీఫ్ మెంటర్ ఎ.కృష్ణారెడ్డి, స్టేట్ చీఫ్ అడ్వైజర్ జి.పుల్లయ్య, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బి.వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎంవీ సుబ్బారెడ్డి, స్టేట్ జనరల్ సెక్రటరీ కె.తులసీవిష్ణుప్రసాద్ కూడా ప్రసంగించారు. అనంతరం టీచర్ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అపుస్మా స్టేట్ అడిషనల్ జనరల్ సెక్రటరీ ఎంబీఎస్ శర్మ, కోశాధికారి ఎంవీ రావు, రీజినల్ జోనల్ ప్రెసిడెంట్ జోన్–2 జీఎస్‌పీ బాలాజీ, స్టేట్ చీఫ్ కో ఆర్డినేటర్ కె.రామిరెడ్డి, ఇస్మా స్టేట్ ప్రెసిడెంట్ కోగంటి శ్రీకాంత్‌బాబు పాల్గొన్నారు.

హలీమ్..రుచికి సలామ్

- 6వ నవాబు మహబూబ్ అలీకి అరబ్బులు పరిచయం చేసిన వంటకం
- దీనికి హైదరాబాద్ రుచులు అద్దిన 7వ నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్
- నేడు ప్రపంచ వ్యాప్తంగా ఇష్టమైన వంటకంగా ఆవిర్భావం
- హైదరాబాద్ తరువాత రాజమహేంద్రవరం ప్రసిద్ధి



హలీమ్ సిద్ధం చేస్తున్న ముస్లిం



చికెన్ హలీమ్



జాంపేటలో హలీమ్ షాపులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): దీని టేస్ట్‌కు ఎవ్వరైనా సలామ్ కొట్టి గులామ్ కావాల్సిందే. ఒకసారి తింటే మళ్లీమళ్లీ తినాలపించే రుచి దీనిది. సంవత్సరంలో ఒక్క రంజాన్ మాసంలోనే ఎక్కువగా లభిస్తుంది. ముస్లింలతో పాటు అన్ని వర్గాల ప్రజలూ ఎంతో ఇష్టంగా తీసుకునే అత్యంత ఆరోగ్యకరమైన (హై హెల్దీ), శక్తిమంతమైన ఆహారం ఇది. పేరు హలీమ్. హైదరాబాద్‌లో ప్రసిద్ధి పొంది, ఆ తరువాత రాజమహేంద్రవరంలో అంత పేరు తెచ్చుకున్న వంటకం బహుశా ఇదేనేమో! హైదరాబాద్ బిర్యానీ తరువాత జిల్లా వాసులు అంత ఎక్కువగా ఇష్టపడే వంటకం హలీమ్. రంజాన్ మాసంలో సాయంత్రం 4 గంటలు దాటిన తరువాత రాజమహేంద్రవరంలో చాలామంది భార్యాపిల్లలతో షాపులకు వచ్చి హలీమ్ తింటుంటారు. కోనసీమ, కాకినాడ, కొవ్వూరు నుంచి కూడా అనేకమంది ఇక్కడకు వచ్చి హలీమ్ రుచి చూస్తారు.

నవాబుల కాలంలో..

హైదరాబాద్ ఆరో నవాబు మహబూబ్ అలీఖాన్‌కు అరబ్ దియాస్పొర తెగకు సంబంధించిన వ్యక్తి హలీమ్‌ను పరిచయం చేశాడు. అప్పట్లో హలీమ్‌లో నాలుగు రకాల దినుసులు మాత్రమే వాడేవారు. ఏడో నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ సూచనలతో ఆస్థాన వంటవారు బిర్యానీకి వాడే దినుసులతో హలీమ్ తయారు చేశారు. ఇది పాత హలీమ్ కంటే రుచిలో మేటిగా, శక్తినివ్వడంలో మరింత మెరుగ్గా తయారైంది. అప్పటి నుంచీ ఈ వంటకం హైదరాబాద్ నుంచి విదేశాలకు ఎగుమతి కూడా అవుతోంది. అరబ్బు దేశం నుంచి వచ్చిన ఈ వంటకం తిరిగి అక్కడికే ఎగుమతి అవుతూండటం విశేషం. ఇప్పుడు అమెరికా, బ్రిటన్ వంటి 30 దేశాల్లోని ప్రజలు దీని రుచిని ఆస్వాదిస్తున్నారు.

మూడు రకాలు

హలీమ్‌లో చికెన్, మటన్, వెజిటబుల్ అనే మూడు రకాలున్నాయి. హలీమ్ తయారీలో స్వచ్ఛమైన నెయ్యి, వెన్న, గోధుమలు, జీడిపప్పు, బాదం, పిస్తా, షాజీరా, యాలకులతో పాటు సన్నగా తరిగి, నేతిలో వేయించిన ఉల్లిపాయలు, పుదీనా, కొత్తిమీర వంటి 30 రకాల వివిధ రుచికరమైన వంట పదార్థాలు వాడతారు. హైదరాబాద్ హలీమ్ పేరుతో 2010లో భారతదేశం జియోగ్రాఫికల్ ఇండికేషన్ స్టేటస్(జీఐఎస్)లో గుర్తింపు పొందింది. రంజాన్ మాసంలో అంతర్జాతీయ ఫుడ్ బిజినెస్‌లో అత్యధికంగా అమ్ముడుపోయే ఆహార పదార్థంగా హలీమ్ ఎదిగింది.

హై హెల్దీ ఫుడ్

రుచిలోనే కాదు.. పోషక విలువల్లో కూడా హలీమ్‌కు సాటి ఏదీ లేదు. అత్యధిక పోషకాలున్న ఆహారం ఇది. హై ప్రొటీన్లు, కేలరీలు, కాల్షియం ఇందులో పుష్కలంగా ఉన్నాయని న్యూట్రీషియన్లు చెబుతారు. శరీరంలో లోపించే విటమిన్లను సమృద్ధిగా అందించే ప్రత్యేక వంటకం హలీమ్. శారీరక శక్తి లోపించిన వారికి ఇది దివ్యౌషధం. అందుకే కఠినమైన ఉపవాస దీక్ష చేసే ముస్లింలు తక్షణ శక్తి కోసం ఉపవాస దీక్ష అనంతరం ఇఫ్తార్‌గా సాయంత్రం హలీమ్ తీసుకుంటారు. దీంతో శరీరంలో శక్తి పునరుత్తేజితం అవుతుంది. మళ్లీ సహర్ నుంచి ఇఫ్తార్ వరకూ ఉపవాస దీక్ష చేయడానికి శక్తిని ఇస్తుంది.

తయారీ ఇలా..

హలీమ్ తయారీ చాలా కష్టంతో కూడుకున్నది. దీని తయారీకి ఇటుకలతో తయారు చేసిన బట్టీలో మంట వద్ద 10 నుంచి 12 గంటల పాటు ఇద్దరు మాస్టర్లు శ్రమ పడాల్సి ఉంటుంది. చిన్న పాటి మంటపై అడుగంటకుండా ఇద్దరు వ్యక్తులు తరచు పొడుగాటి చేతికర్ర తిప్పుతూ ఉండాలి. ఏ మాత్రం అడుగంటినా దీని రుచి పాడవుతుంది.

రాజమహేంద్రవరం రావాల్సిందే..

ఒకప్పుడు హలీమ్ పేరు చెప్తే హైదరాబాద్ గుర్తుకు వచ్చేది. కానీ నేడు రాజమహేంద్రవరం నగరానికి కూడా పేరు వచ్చింది. హైదరాబాద్ నుంచి వంట మాస్టర్లను తీసుకు వచ్చి అదే రుచి వచ్చేలా ఇక్కడా తయారు చేస్తున్నారు. రాజమహేంద్రవరం జాంపేటలో సుమారు 20 షాపులు ఏర్పాటు చేశారు. వీటిలో 60 నుంచి 70 మంది మాస్టర్లు పని చేస్తున్నారు. చికెన్, మటన్ హలీమ్‌లు ఎక్కువగా అమ్ముడవుతున్నాయి. చికెన్ హలీమ్ రూ.90కి, మటన్ హలీమ్ రూ.120, వెజిటబుల్ హలీమ్ రూ.50కి విక్రయిస్తున్నారు. మరి కొన్ని షాపుల్లో చికెన్ హలీమ్ రూ.60, మటన్ హలీమ్ రూ.90కి విక్రయిస్తున్నారు. హలీమ్ తిన్న తరువాత ఎవ్వరైనా సరే స్పెషల్ రంజాన్ డ్రింక్‌లు తాగకుండా వెళ్లలేరు. ఫ్రూట్ సలాడ్, పాలుధా, డ్రైఫ్రూట్ ఐస్‌క్రీమ్, షర్బత్, జీరా సోడా వంటి వాటికి గిరాకీ ఎక్కువ.

శ్రమతో కూడుకున్నది

హలీమ్ తయారీకి 10 నుంచి 12 గంటల వరకూ పడుతుంది. తెల్లవారుజామున ప్రారంభిస్తే సాయంత్రం 4 గంటలకు అందించగలం. పెద్ద పొయ్యి మీద పెద్ద బానలు పెట్టి వండుతాం. ఒక్కో బానలో 10 కేజీల వరకూ హలీమ్ తయారవుతుంది. 10 కేజీల చికెన్, 10 కేజీల మటన్, 10 కేజీల వెజిటబుల్ హలీమ్ తయారు చేస్తాం. హలీమ్ తయారీలో మూడు తరాల నుంచి ప్రావీణ్యం ఉంది. – షేక్ చాంద్

ఈ టేస్ట్‌కు మరేదీ సాటి రాదు

ఇక్కడ అమ్ముతున్న హలీమ్‌ను ప్రతి సంవత్సరం రంజాన్ మాసంలో క్రమం తప్పకుండా తింటున్నాను. దీని టేస్ట్‌కు మరేదీ సాటి రాదు. చికెన్, మటన్ హలీమ్‌లు చాలా టేస్టీగా ఉంటాయి. నోటిలో పెట్టుకుంటే ఇట్టే కరిగిపోతాయి. పేస్టు చేసినట్టుగా ఉండటంతో నమిలి మింగాల్సిన అవసరం లేకుండా గొంతులోకి జర్రున జారిపోతుంది. – కె.శ్రీనివాస్

ఓపెన్ స్కూల్ పరీక్షలకు చురుగ్గా ఏర్పాట్లు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 64 పరీక్షా కేంద్రాలు
- హాజరు కానున్న 19,545 మంది విద్యార్థులు
- ఏప్రిల్ 3 నుంచి 17 వరకు నిర్వహణ

రాయవరం: పది రెగ్యులర్ పరీక్షలతో పాటుగా, ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదో తరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఉన్నత చదువు కోసం ఆశ పడినప్పటికీ అనుకోని అవాంతరాలు, ఆర్థిక ఇబ్బందులతో చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టేసిన వారి కోసం ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా అవకాశం కల్పిస్తున్నారు. అటువంటి వారి కోసం ఓపెన్ స్కూల్ విధానం అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ ఏడాది కూడా ఓపెన్ స్కూల్ విధానం ద్వారా పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ మూడో తేదీ నుంచి పరీక్షల నిర్వహణకు ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఏర్పాట్లు చేసింది. పరీక్షల నిర్వహణలో భాగంగా టైమ్ టేబుల్‌ను విడుదల చేసింది.

ఉమ్మడి జిల్లాలో విద్యార్థుల వివరాలు

జిల్లా	ఎస్ఎస్‌సీ	ఇంటర్	మొత్తం
కోనసీమ	1,248	4,400	5,648
కాకినాడ	2,088	5,527	7,615
తూర్పు గోదావరి	2,092	4,190	6,282

166 స్టడీ సెంటర్ల ద్వారా..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సార్వత్రిక విద్యకు 166 స్టడీ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం పొందిన అభ్యాసకులకు ప్రతి ఆదివారం, రెండో శనివారం షెడ్యూల్ ప్రకారం తరగతులు నిర్వహించి, స్టడీ మెటీరియల్‌ను అందజేసి పరీక్షలకు సన్నద్ధం చేశారు.

ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా ఇంటర్ అభ్యాసకులకు సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ, ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ కోర్సులను అందిస్తున్నారు.

పరీక్షలు హాజరు కానున్న 19,545 మంది విద్యార్థులు

ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు గతేడాది ఆగస్టులో ఏపీ సార్వత్రిక విద్యాపీఠం విడుదల చేసిన నోటిఫికేషన్ ద్వారా 17,778 మంది దరఖాస్తు చేసుకున్నారు. పదో తరగతి ప్రవేశ పరీక్షకు 4,916 మంది, ఇంటర్‌లో ప్రవేశానికి 12,862 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరితోపాటు గతంలో పరీక్షలు రాసి, ఉత్తీర్ణత పొందనివారు కూడా ఇప్పుడు పరీక్షలు రాయనున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పదవ తరగతికి 19 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 5,428 మంది పరీక్షలు రాయనున్నారు. ఇంటర్ పరీక్షలు 14,117 మంది రాయాల్సి ఉంది. 45 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ఇప్పటికే హాల్ టికెట్లు విడుదల చేసి, ఏపీ సార్వత్రిక విద్యాపీఠం వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. అభ్యర్థులు హాల్ టికెట్లను ఇప్పటికే డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు.

పరీక్షల టైమ్ టేబుల్ ఇదీ..

తేదీ	10వ తరగతి	ఇంటర్
ఏప్రిల్ 3	తెలుగు, ఉర్దూ, కన్నడ, ఒరియా, తమిళం	హిందీ, తెలుగు, ఉర్దూ
ఏప్రిల్ 6	హిందీ	జీవశాస్త్రం, వాణిజ్య/ వ్యాపార శాస్త్రం, గృహ విజ్ఞాన శాస్త్రం
ఏప్రిల్ 8	ఇంగ్లిష్	ఇంగ్లిష్
ఏప్రిల్ 10	గణితం, భారతీయ సంస్కృతి గణితం, చరిత్ర, మరియు వారసత్వం	వ్యాపార గణక శాస్త్రం
ఏప్రిల్ 13	శాస్త్ర మరియు సాంకేతిక విజ్ఞానం, గృహ విజ్ఞానశాస్త్రం	ఫిజిక్స్, సివిక్స్, మనో విజ్ఞాన శాస్త్రం
ఏప్రిల్ 15	సాంఘిక శాస్త్రం, ఆర్థిక శాస్త్రం	కెమిస్ట్రీ, ఎకానమిక్స్, సామాజిక శాస్త్రం
ఏప్రిల్ 17	బిజినెస్ స్టడీస్, మనో విజ్ఞాన శాస్త్రం మరియు అన్ని వృత్తి విద్యా సబ్జెక్టులు	అన్ని వృత్తి విద్యా సబ్జెక్టులు



ఓపెన్ స్కూల్ తరగతులకు హాజరైన అభ్యాసకులు

హాల్ టిక్కెట్లు జారీ



ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా నిర్వహించనున్న పదవ తరగతి, ఇంటర్ పరీక్షలకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నాం. గుర్తించిన పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నాం. పరీక్ష పేపర్లు 29న జిల్లా కేంద్రానికి చేరుకోనున్నాయి.

– పి.సాయి వెంకట రమణ, జిల్లా కన్వీనర్, ఏపీ ఓపెన్ స్కూల్, అమలాపురం

సీఎస్, డీవోల నియామకం



ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే సీఎస్, డీవోల నియామకాలు చేపట్టాం. సీఎస్, డీవోలకు ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని కూడా నిర్వహించాల్సిందిగా సూచించా. ఎటువంటి లోటుపాట్లకూ తావులేని విధంగా పరీక్షలు నిర్వహించాలని డీఈఓలకు ఆదేశాలిచ్చాం.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

క్లుప్తంగా

రోడ్డు కం రైలు వంతెనపై రాకపోకల పునరుద్ధరణ



రోడ్డు కం రైలు వంతెనపై ఫుట్‌పాత్‌లపై వేస్తున్న కాంక్రీటు శ్లాబు

కొవ్వూరు: రోడ్డు కం రైలు వంతెనపై ఆదివారం సాయంత్రం ఆరుగంటల నుంచి వాహన రాకపోకలను పునరుద్ధరించారు. ఫుట్‌పాత్‌లు, హ్యాండ్ రైలింగ్‌ల మరమ్మతుల్లో భాగంగా ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. రోడ్డు కం రైలు వంతెన అత్యవసర మరమ్మతుల నిమిత్తం కేటాయించిన రూ.20లక్షలతో ఈ పనులు చేపట్టినట్లు ఆర్‌సీఆర్‌బీ డీఈఈ బీవీ మధుసూదనరావు తెలిపారు. రాజమహేంద్రవరం వైపు గతంలో తొలగించిన ఫుల్‌పాత్‌ల స్థానంలో సిమెంటు కాంక్రీటు శ్లాబు వేశామన్నారు. భారీ క్రేన్‌ల సాయంతో కొవ్వూరు వైపు దెబ్బతిన్న ఫుట్‌పాత్‌లను, హ్యాండ్ రైలింగ్స్‌ను పూర్తిగా తొలగించామన్నారు. దిగువన రైల్వే శాఖ నూతనంగా ఐరన్ గడ్డర్లు అమర్చుతోందన్నారు. దెబ్బతిన్న ఫుల్‌పాత్‌లు, హ్యాండ్ రైలింగ్‌లు తొలగించిన ప్రదేశంలో రైల్వే శాఖ గడ్డర్లు అమర్చిన తర్వత తాము సిమెంటు కాంక్రీటు శ్లాబువేస్తున్నామన్నారు.

నేడు రత్నగిరిపై ధర్మకర్తల మండలి సమావేశం



అన్నవరం దేవస్థానం

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి తొలి సమావేశం సోమవారం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గత ధర్మకర్తల మండలి పదవీ కాలం 2022 ఫిబ్రవరితో ముగిసింది. సుమారు ఏడాది పాటు దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త ఐవీ రోహిత్ ఒక్కరే ఏకసభ్య ట్రస్టుబోర్డుగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. కాగా గత ఫిబ్రవరి నెలలో 16 మంది సభ్యులతో దేవస్థానానికి పూర్తి స్థాయి ట్రస్టుబోర్డును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ట్రస్టుబోర్డు సభ్యులు ఫిబ్రవరి 9న ప్రమాణ స్వీకారం చేశారు. వ్యవస్థాపక ధర్మకర్త ఐవీ రోహిత్ చైర్మన్‌గా, ఆలయ ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా గత నెల చివరి వారంలో ప్రమాణ స్వీకారం చేశారు. కాగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఇప్పటివరకూ ట్రస్టుబోర్డు సమావేశం నిర్వహించలేదు.

మూడు గంటలకు అభినందనసభ

రత్నగిరిపై రామాలయం పక్కన ఉన్న విశ్రాంతి మంటపంలో సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు ట్రస్టీలకు అభినందన సభ నిర్వహించనున్నారు. ఈ సభకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ వంగా గీత, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరవుతారు. అనంతరం ప్రకాష్ సదన్‌లోని ధర్మకర్తల మండలి హాలులో చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన ట్రస్టుబోర్డు సమావేశం నిర్వహిస్తారు.

పలు అంశాలపై చర్చ

ట్రస్టుబోర్డు సమావేశంలో 2023–24 సంవత్సరం దేవస్థానం బడ్జెట్, జాతీయ రహదారి మీద నిర్మించనున్న సత్యదేవుని నమూనా ఆలయం నిర్మాణం, ఏప్రిల్ 30 నుంచి మే ఆరో తేదీ వరకూ జరగనున్న సత్యదేవుని వార్షిక దివ్యకల్యాణ మహోత్సవాల ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించి తీర్మానాలు చేస్తారు.

ఐదు తాటాకిళ్లు దగ్ధం

రూ.5.50 లక్షల ఆస్తి నష్టం

అమలాపురం రూరల్: బండారులంక గ్రామంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో అయిదు తాటాకిళ్లు దగ్ధమై ఏడు కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. ఈ ప్రమాదంలో రూ.5.50 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. బండారులంక గ్రామ పరిధి పేరివారి కాలనీలో చందన ఎల్ఎన్‌వీవీ సత్యనారాయణ ఇంట్లోని గ్యాస్ సిలిండర్ లీకైంది.

ఆ సమయంలో స్టౌ వెలిగించడంతో ప్రమాదం చోటు చేసుకుంది. సత్యనారాయణ ఇల్లుతో పాటు దొడ్డిపట్ల పల్లాలమ్మ తాటాకిల్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఆకాశపు సూర్య నాగేశ్వరరావు, కాశిన శ్రావణాంబ, కారుపర్తి రామలింగేశ్వరరావు, బల్ల సత్యనారాయణ, పడవల వెంకటేశ్వరరావు ఇళ్లు పాక్షింగా దగ్ధమయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాద సమయంలో బల్ల సత్యానారాయణ చాకచక్యంగా వ్యవహరించి లీకైన గ్యాస్ బండను కాలువలోకి విసిరేశాడు. కాసేపటికే అది పేలిపోయింది. దీంతో పెను ప్రమాదం తప్పింది. అయితే కొబ్బరి ఆకుల దాడి అంటుకుని సత్యనారాయణకు గాయాలయ్యాయి. అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో మోటార్ సైకిళ్ళు, మగ్గాలు, రూ.86,500 నగదు, విలువైన వస్తువులు కాలి బుడిదయ్యాయి.



బండారులంకలో అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న ఇళ్లు

ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, సర్పంచ్ పెనుమాల సునీత ఏడుకొండలు తహసీల్దార్ పరమట శ్రీపల్లవి, డిప్యూటీ తహసీల్దార్ అడపా సుబ్రహ్మణ్యం బాధితులను పరామర్శించారు. 25 కేజీల వంతున బియ్యం పంపిణీ చేశారు. తహసీల్దార్ శ్రీపల్లవి సొంతంగా బాధితులకు రూ.11వేలు అందజేశారు.



బాధితులకు ప్రభుత్వం అందించిన బియ్యం పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు తదితరులు

త్వరలో భారీ బహిరంగ సభ

- తుని, రాజమహేంద్రవరంలో నిర్వహించేందుకు ప్రణాళిక
- ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్

రాజమహేంద్రవరం సిటీ: యువత బలాన్ని చాటి చెప్పేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తుని పట్టణంలోగాని, రాజమహేంద్రవరం నగరంలోగానీ భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సన్నాహాలు చేస్తున్నారని ఉమ్మడి ఉభయ గోదావరి జిలాల వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడిగణేష్ పేర్కొన్నారు. ఆదివారం విజయవాడలోని వైఎస్సార్ సీపీ ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, శాప్ రాష్ట్ర చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిలను భారీ ఎత్తున తరలివచ్చిన యువన విభాగం సభ్యులతో కలిశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో 26 జిల్లాల్ల సమావేశాలు నిర్వహించేందుకు రాష్ట్ర అధ్యక్షుడు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీలో యువత బలం చూపించేందుకు భారీ ఎత్తున ఈ సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. రానున్న రోజుల్లో ఇంకా బాగా కష్టపడాలని యువకులంతా అండగా ఉంటే ఎంతటి కష్టమైనా పోరాటమైనా ఎదుర్కోవచ్చని సిద్ధార్థరెడ్డి ప్రకటించారన్నారు.



విజయవాడలో ఎంపీ మిధున్‌రెడ్డిని కలిసిన జక్కంపూడి గణేష్

ఈ సందర్భంగా జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని విజయపథంలో నడిపించి మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రి చేసే వరకూ విశ్రమించేది లేదన్నారు. పార్టీ ప్రారంభం నుంచి జగనన్న వెంట జక్కంపూడి కుటుంబం నిలిచిందన్నారు. ఏ విషయమైనా తూర్పు గోదావరి జిల్లా నుంచి మొదలవ్వడం సెంటిమెంటు అని, అలా తూర్పు గోదావరి జిల్లా నుంచి వైఎస్సార్ యువజనం వినిపించే గళానికి తెలుగుదేశం అదిరిపోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల విద్యార్థి విభాగం జోనల్ ఇన్‌చార్జి నీలి వీర ఆనంద్ కుమార్, వైఎస్సార్ సీపీ యువత పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గండేపల్లి: గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి చెందాడు. గండేపల్లి ఎస్సై వై.గణేష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని మురారి గ్రామానికి చెందిన సూదికొండ అప్పారావు(55) ఈ నెల 22వ తేదీ అర్ధరాత్రి కాలకృత్యాల కోసం బయటకు వెళ్లాడు ఆంజనేయస్వామి గుడి దగ్గరలో రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో మృతుడు శరీరం గుర్తుపట్టలేని విధంగా నుజ్జునుజ్జు అయ్యింది. మృతుడి భార్య సత్యవతి ఆదివారం ఫిర్యాదు చేసినట్లు, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గురుకులాల్లో దరఖాస్తుకు 31 వరకు గడువు

రాయవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువును పొడిగించారు. 2023–24 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ ఫస్టియర్(ఇంగ్లిష్ మీడియం) లో ప్రవేశాల దరఖాస్తుకు ప్రభుత్వం నోటిఫికేషన విడుదల చేసిన విషయం పాఠకులకు విదితమే. తొలుత ప్రవేశాల దరఖాస్తుకు ఈ నెల 24వ తేదీ వరకు గడువు ఇవ్వగా, తల్లిదండ్రుల నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు దరఖాస్తుకు ఈ నెల 31 వరకు గడువును పొడిగించారు.

నేడు నిధి ఆప్‌కే నికత్

రాజమహేంద్రవరం రూరల్: ఉద్యోగులు భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి నిధి ఆప్‌కే నికత్–డిస్ట్రిక్ట్ ఔట్‌రీచ్ ప్రోగ్రాం జరగనుంది. పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ వైడీ శ్రీనివాస్ ఈ విషయం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల ఖాతాదారులు ఈసేవలు వినియోగించుకోవచ్చునన్నారు. భవిష్యనిధి అంతిమ ఉపసంహరణ, ఖాతాల బదిలీ తదితర అంశాలకు సంబంధించి పరిష్కరిస్తామన్నారు. తూర్పుగోదావరిజిల్లా పరిధిలో పెద్దాపురంలో శ్రీలలితా ఎంటర్‌ప్రైజస్ ఇండస్ట్రీస్(ప్రై)లిమిటెడ్ ఆవరణలోను, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం వేదాంత లిమిటెడ్ ఆవరణలోను, అల్లూరి సీతారామరాజుజిల్లా పరిధిలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ రిసోర్స్‌సెంటర్ ఆవరణలోను, కాకినాడజిల్లా పరిధిలో కాకినాడ ఈపీఎఫ్‌వో జిల్లా కార్యాలయంలోను, ఏలూరు జిల్లా పరిధిలో ఏలూరు సీఆర్‌రెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అటానమస్ కాలేజ్ ఆడియో విజువల్ హాల్‌లోను, పశ్చిమగోదావరిజిల్లా పరిధిలో భీమవరం ఈపీఎఫ్‌వో జిల్లా కార్యాలయంలోను ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లో పెన్షన్ అర్హత, పెన్షన్ లెక్కించడం, పెన్షన్‌క్లెయిమ్, పెన్షన్ ఉపసంహరణ అండ్ స్కీమ్ సర్టిఫికెట్, ఇ–నామినేషన్, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్, ఇతర సమస్యలు పరిష్కరిస్తామన్నారు.ఈపీఎఫ్‌వో సభ్యులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిష్మెంట్‌లు, కొత్తగా కవర్ చేసిన ఎస్టాబ్లిష్మెంట్‌లు ఈ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్‌ను ఉపయోగించుకోవాలన్నారు. నిధి ఆప్‌కే నికత్ అని పేర్కొంటూ తమ ఫిర్యాదులను సమర్పించవచ్చని అసిస్టెంట్ పీఎఫ్ కమీషనర్ వైడి శ్రీనివాస్ తెలిపారు.

నేడు రత్నగిరిపై డయల్ యువర్ ఈఓ

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సోమవారం 'డయల్ యువర్ ఈఓ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతీ నెల చివరి సోమవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఉదయం 10–30 నుంచి 11–30 గంటల వరకు భక్తులు 08868–238127 నంబర్‌కు ఫోన్ చేసి దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్‌కు తమ సలహాలు, సూచనలతోబాటు ఫిర్యాదులు తెలియ చేయవచ్చునని తెలిపారు.

క్రైం కార్నర్..

ఉప సర్పంచ్ దారుణ హత్య



శీని ప్రసాద్ (ఫైల్)

కొవ్వూరు: వేములూరు ఉప సర్పంచ్, టీడీపీ నాయకుడు శీని సత్యవరప్రసాద్ ఆదివారం దారుణ హత్యకు గురయ్యారు. వివాద రహితుడిగా పేరున్న ప్రసాద్ హత్య వార్తతో వేములూరు ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఉదయం ఆయన తన స్వగృహంలోని వరండాలో విగతజీవుడిగా పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీము ఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్నాయి. భార్య శ్రీకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అసలు రాత్రి ఏం జరిగిందో...

శనివారం రాత్రి పదిన్నర గంటల వరకు ప్రసాద్ ఇంటి దగ్గర స్థానికులతో మాట్లాడారని చెబుతున్నారు. 11 గంటలకు తన కుమార్తెతో ఫోన్ మాట్లాడినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. అర్ధరాత్రి దాటిన తర్వాత కేకలు, అరుపులు వినిపించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఏదైనా తగవు తీర్చుతున్నారేమో అనుకున్నామంటున్నారు. అసలు అర్ధరాత్రి ఏం జరిగింది? గొడవ పడింది ఎవరు? అన్నది మిస్టరీగా మారింది. ప్రసాద్ తలకు గాయమైంది. తలను గోడకు కొట్టినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. విగత జీవుడిగా పడి ఉన్న ప్రసాద్ ఒంటిపై నూలు పోగు కూడా లేదు.



శీని ప్రసాద్ మృతదేహం

గత కొనేళ్లుగా ఒంటరిగానే...

ప్రసాద్ కొన్నేళ్లుగా ఒంటరిగానే ఉంటున్నారు. భార్య శ్రీకళ జంగారెడ్డిగూడెంలో ప్రైవేటు కళాశాలలో పని చేస్తూ పిల్లలతో కలిసి అక్కడే ఉంటున్నారు. ఐదారేళ్ల క్రితం తల్లి మృతి చెందడంతో ప్రసాద్ హోటల్‌లో భోజనం చేస్తున్నారని చెబుతున్నారు. కుమారుడు హనురామ్ ప్రస్తుతం రాజానగరం గైట్ కళాశాలలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. కుమార్తె సుప్రజ సీఆర్ రెడ్డి కళాశాలలో ఫార్మ్–డి చదువుతుంది. ప్రసాద్‌కి భార్యకు మధ్య అంతగా సఖ్యత ఉండేది కాదంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

ప్రత్తిపాడు రూరల్: రాచపల్లి అడ్డురోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన నకిరెడ్డి వీర్రాజు (75) రాచపల్లి అడ్డు రోడ్డు సమీపంలోని మామిడి తోటను లీజుకు తీసుకొని కాపలా ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి మామిడితోట నుంచి ఇంటికి కాలినడకన బయలుదేరాడు. రాచపల్లి అడ్డురోడ్డు వద్ద జాతీయ రహదారి దాటుతుండగా ద్విచక్ర వాహనం బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వీర్రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గాయపడ్డ వ్యక్తి మృతి

జగ్గంపేట: మండలంలోని మల్లిసాల గ్రామానికి చెందిన దాట్ల జగన్నాథరాజు (77) రోడ్డు ప్రమాదంలో గాయపడి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ కథనం మేరకు వెంగాయ్యమ్మపురం గ్రామంలో అత్తులూరి వారి బాయిల్డ్ రైస్ మిల్లులో దాట్ల జగన్నాథరాజు వాచ్‌మెన్‌గా పని చేస్తున్నారు. ఈ రోజు ఉదయం 7గంటల ప్రాంతంలో రైసు మిల్లు నుంచి టిఫిన్‌కోసం మల్లిసాల సైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను తప్పించబోయి జగన్నాథరాజు రోడ్డుపై పడిపోయారు. మల్లిసాల వెళ్లే మార్గంలో జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద జరిగిన ఈ ప్రమాదంలో అతని తలకి తీవ్రగాయాలు కావడంతో ప్రాథమిక చికిత్సకోసం జగ్గంపేటలోని సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉదయం 10 గంటల ప్రాంతంలో మృతి చెందినట్లు ఎస్సై విద్యాసాగర్ వివరించారు. మృతుడు సోదరుడు దాట్ల వెంకటరామరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కే సు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పంట కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్ల పంట కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మహిళ వయసు సుమారు 55 నుంచి 60 వరకూ ఉంటాయని, తెలిసినవారు ఐ.పోలవరం పోలీసులను సంప్రదించాలని ఎస్సై రాజేష్ తెలిపారు. పంట కాలువలో పడి ఉన్న మృతదేహాన్ని టి.కొత్తపల్లి సీహెచ్‌సీకి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మురమళ్ల పంట కాలువలో పడిఉన్న మృత దేహం